
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## నేటి నుండి ఆమరణ నిరాహార దీక్ష

**షాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** తమకు న్యాయం జరిగే వరకు ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని చందన్‌వెల్లి భూనిర్వాసితులు తెలిపారు. న్యాయం చేయమని నెలల తరబడి నిరసనలు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆవేధన వ్యక్తం చేశారు. తమకు న్యాయంగా అందాల్సిన పరిహారం అక్రమంగా దోచేసిన దొంగలకు, అక్రమార్కులకు అధికారులు, ప్రజాప్రతినిధులు వంత పాడుతూ తమను నట్టేట ముంచారన్నారు. తమ జీవితానికి ఆధారమైన భూములు కోల్పోయిన పరిహారం అందక మేము బ్రతికి ఉన్న శవంలా జీవిస్తున్నామని వారన్నారు. తమకు పరిహారం అందితేనే తమ జీవితాలు సాగుతాయని లేకుంటే తినలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. తమకు న్యాయం జరగాలని చేసే పోరాటంలో ప్రాణాలను సైతం విడవడానికి తమ సిద్ధంగా ఉన్నామని, అందుకోసమే శుక్రవారం నుండి అమరణ నిరాహార దీక్ష చేపడుతున్నామన్నారు. ఈకార్య క్రమంలో భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు నీరటిఆంజనేయులు, గూడూరు జంగయ్య, అనంతం, నర్సింలు, దయాకర్, రాంబాబుగౌడ్, సలీం, చంద్రయ్య, భూషన్, బేగరి బాలమణి, అంజయ్య ఉన్నారు.

## ఆర్టీసీ సేవలపై అవగాహన


డబిల్‌పూర్ గ్రామంలో ఆర్టీసీ సేవలపై అవగాహక కల్పించిన కళాజాత బృందం సభ్యులు

**మేడ్చల్, జనవరి 26. ప్రభాతవార్త :** ఆర్టీసీ ప్రజలకు అందిస్తున్న సేవలను ఆర్టీసీ చైతన్య కళాబృందం సభ్యులు గురువారం డబిల్‌పూర్ అవగాహన కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని డబిల్‌పూర్‌లో గ్రేటర్ హైదరాబాద్ కళాబృందం జోన్ ఈడీ యాదగిరి నేతృత్వంలో కళాకారులు ఆటపాటలతో చేపట్టిన కళాజాత ప్రదర్శన కార్యక్రమంలో ఆర్టీసీ ప్రవేశ పెట్టిన పలు రాయితీల పథకాలు, తిరుపతికి వెళ్లే భక్తులకు ప్రత్యేక దర్శనం, టీ 24, సింగరేణి దర్శన్, హైదరాబాద్ దర్శిని, కార్గో తదితర సేవలను ప్రజలకు అర్థమయ్యే విదంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, మేడ్చల్ ఆర్టీసీ డిపో సీఆర్‌సీ పిఎస్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీశ్,పాల్గొన్న డిసిపి సందీప్, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి,అభిషేక్ ఆగస్త్య, డిఆర్ఓ లింగ్యానాయక్, తదితరులు


కలెక్టరేట్ వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్, జడ్పీటిసిలు,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్,ఆర్డీఓ, తదితరులు


జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు సైనిక విన్యాసాలు చేసిన దృశ్యం

### మేడ్చల్ కలెక్టరేట్‌లో

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 26, ప్రభాతవార్త :** జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందంజలో ఉందని, మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు, ప్రజాప్రతినిధుల, అధికారుల,సమన్వయం, సహకారం అవసరమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు. గురువారం ఉదయం మేడ్చల్ జిల్లా (శామీర్‌పేట మండల పరిధిలోని) నూతన కలెక్టరేట్ ముందు గల గ్రౌండ్‌లో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగ జరిగాయి. దీనిలో జిల్లా కలెక్టర్ హరీశ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుకు కృషి జరుగుతుందని, అన్ని రంగాల్లో ముందు ఉంచటానికి కృషి చేస్తున్నామన్నారు. పల్లె,పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా మౌళిక సదుపాయాల కల్పనకు కృషి జరుగుతుందని, వైకుంఠదామాలు, స్మృతి వనాలు, డంపింగ్‌యార్డులు,ఆహ్లాదకరమైన పార్కులు, పచ్చదనం, నర్సరీలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. రైతు బంధు, రైతుభీమా, ఆసరా ఫింఛన్లు సంక్షేమ పథకాల అమలు జరుగుతుందన్నారు. జిల్లాలో కొత్తగా 983ఆహార భద్రతా కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 11వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి లక్షా43వేల క్వింటాళ్ల వరి ధాన్యంను కొనుగోలు చేసి 2,809మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో 29కోట్ల రూపాయలు జమచేశామన్నారు. కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం కింద లక్షా 116రూపాయల చొప్పున జిల్లాలో 8,329 మందికి 83కోట్ల 38లక్షల రూపాయలు ఆర్థిక సహాయంగ అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మనబడి, మన బస్తి–మన బడి కార్యక్రమంలో జిల్లా నుంచి 176 ప్రభుత్వ పాఠశాలలను తీసుకుని, వీటిలో 30పాఠశాలలో పనులు పూర్తి చేసి ప్రారంభించటానికి సిద్ధంగ ఉన్నట్లు వివరించారు. జిల్లాలో దళితబంధు పథకం కింద 10లక్షల రూపాయల చొప్పున 563మందికి జీవనోపాధి కోసం మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేసినట్లు కలెక్టర్ హరీశ్ వివరించారు. షీక్యాబ్ పైలట్ ప్రాజెక్టు కింద 23మంది లబ్దిదారులకు క్యాబ్‌లను అందజేశామన్నారు. మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పోరేషన్‌లలో 60క్రీడా ప్రాంగణాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు వివరించారు. జిల్లా స్థాయిలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించటం కోసం దేవరయాంజాల్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సారి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను ఘనంగ నిర్వహించటానికి కృషి జరుగుతుందని కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగ స్వాతంత్ర సమరయోధులను కలెక్టర్ సన్మానించి సత్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. డిఆర్‌డిఏ నుంచి స్వయం సహాయక మహిళా గ్రూపులకు బ్యాంకు లింకేజి కింద 30కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. జిల్లా, మండల అధికారులకు, సిబ్బందికి సుమారుగ 85మందికి ప్రశంస పత్రాలు (అవార్డులు) కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, డిసిపి సందీప్, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, జడ్పీవైస్‌చైర్మన్ బి.వెంకటేశ, జడ్పీటిసిలు ఎం.అనితలాలయ్య, శైలజ, కలెక్టరేట్ ఎఓ వెంకటేశ్వర్లు, ఎస్సీ,ఎస్టీ డివిసి సభ్యులు ఎ.ధన్‌రాజ్‌నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో


పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర.



జెండా ఎగరవేస్తున్న సీపీ.

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26, (ప్రభాతవార్త) :** సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్‌లో గురువారం ఘనంగా 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ముందుగా సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ముందుగా ప్రజలు, పోలీస్‌సిబ్బంది, మీడియాకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం కుల,మత, లింగ వివక్ష బేదం లేకుండా అందరికీ సామాన్య హక్కులను, బాధ్యతలను, అవకాశాలను కల్పించిందన్నారు. దేశం కోసం పోరాడిన ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ.. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రజాసేవకు అంకితమవ్వాలన్నారు. సైబరాబాద్ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణనాయక్, సైబరాబాద్ డీసీపీ ట్రాఫిక్ టి.శ్రీనివాస్‌రావు, మాదాపూర్ డీసీపీ శ్రీమతి శిల్పవల్లి, శంషాబాద్ డీసీపీ శ్రీ జగదీశ్వర్‌రెడ్డి, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ డీసీపీ కవిత, డీసీపీ ఇందిరా, డీసీపీ లావణ్య, సైబర్ క్రైమ్స్ డీసీపీ రితిరాజ్, రోడ్ సేఫ్టీ డీసీపీ ఎల్‌సీ నాయక్, ఏడీసీపీలు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు


షాద్‌నగర్ ఆర్డీఓకు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ ఆమోయ్‌కుమార్


ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26, (ప్రభాతవార్త) :** సమీకృత కార్యాలయాల సముదాయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆమోయ్‌కుమార్. 74వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆమోయ్‌కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి కీలకోపన్యాసం చేశారు. రిపబ్లికెడే వేడుకల సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకొని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ ఆమోయ్‌కుమార్ ప్రశంసాపత్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు తిరుపతిరావు, ప్రతీక్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ కదివరన్ పలనీ, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు,సిబ్బందికి అవార్డు అందజేసిన కలెక్టర్ నిఖిల,అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ,ఎస్‌పి రషీద్ –ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి

## కనులపండువగా చిన్నారులకు అక్షరాభ్యాసం


ఆమనగల్లు శిశుమందిర్‌లో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న సిఐ జాల ఉపేందర్

**ఆమనగల్లు, జనవరి26, ప్రభాతవార్త:** వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణానికి చెందిన శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహకులు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక సిఐ జాల ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య సరస్వతి పూజా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. అనంతరం పాఠశాల ఆవరణలో చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. సామూహిక అక్ష్యరాభ్యాస కార్యక్రమానికి తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించింది. దీంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొన్నది. ముఖ్య అతిథులు, చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులతో పాఠశాల ఆవరణ కోలాహలంగా దర్శనమిచ్చింది. గణతంత్ర్య దినోత్సవం పురష్కరించుకుని నిర్వహించిన క్రీడలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సిఐ జాల ఉపేందర్ చేత పాఠశాల నిర్వహకులు బహుమతులు పంపిణి చేశారు. ఈసంధర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథి సిఐ జాల ఉపేందర్ మాట్లాడుతూ చిన్నారులను విద్యావంతులను చేసే బాధ్యత తల్లిదండ్రులు విస్మరించరాదని చెప్పారు. విద్యతోనే మంచి చెడు ఆధారపడి ఉంటుందని, మంచి చదువు సంస్కారవంతున్ని చేస్తుందని వివరిం చారు. కాలయాపన చేయకుండా చిన్నారులను పాఠశాలలో చేర్పించి ఉన్నతం గా తీర్చిద్దాలని సిఐ జాల ఉపేందర్ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు దొంతు సత్యనారాయణ, చంద్ర ప్రకాష్‌రెడ్డి, సుక్క అల్లాజి గౌడ్, వల్లభదాసు నారాయణగౌడ్, బావండ్ల అంజయ్య, దొంతువిశ్వనాథం, గుజ్జరి తిరుపతయ్య, దార్ల చిత్తరంజన్‌దాస్, జెజ్జాయిల ఆనంద్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

### గణతంత్ర దినోత్సవానికి వెళ్తు బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

**మొయినాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** గణతంత్ర దినోత్సవానికి హాజరుకావాలంటు ఇంటి నుండి బయలుదేరి దారి మధ్యలో బైక్ పై నుండి అదుపుతప్పి పడి తిరిగిరాని లోకానికి వెళ్లాడు, శోక సంద్రములో కుటీంబికులు మిగిలిపోయారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడి సోదరుడు మేకగూడెం వెంకటేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు మండలంలోని అమీర్‌గూడ గ్రామానికి చెందిన ప్రవీణ్ (30) వృత్తి ఔట్సోర్సింగ్ ఎంప్లాయి,గా గ్రేహండ్స్‌లో పనిచేస్తున్నాడు, గురువారం ఉదయం 6:45 గంటల సమయంలో ప్రవీణ్ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణకు హాజరుకావాలని తన బైక్ నెంబర్ టిఎస్ 07.ఎచ్‌డబ్ల్యూ.5069 పల్సర్ బైక్ పై వెళ్తుండగా అజీజ్‌నగర్ చౌరస్తా నుండి కోద్ది దూరంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు రోడ్డు మధ్యలో ఉన్న చెట్టును ఢీ కోట్టి బలమైన రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృత్తి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిచారు, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కొడంగల్ ప్రజల అండతో తెలంగాణ దశ దిశ నిర్దేశించే స్థాయికి ఎదిగా

**-119మంది ఎమ్మెల్యేల ఎంపిక నాదే**
**-ఇది కొడంగల్ ప్రజలు అందించిన గొప్పతనం**
**-హత్ సే హత్ జోడోయాత్ర కర్రపత్రం విడుదల చేసిన టీపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రేవంత్‌రెడ్డి

**బొంరాస్‌పేట్,కొడంగల్,జనవరి26,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్,దుద్యాల్ మండలల్లో టీపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మదన్‌పల్లి,దుద్యాల్ మండలాల్లో పర్యటించారు.2009లో శాసనసభ్యులుగా కొడంగల్ ప్రజలు నన్ను గెలిపించడంతోనే ఈ రోజు కాంగ్రెస్‌పార్టీ టీపిసిసి అధ్యక్షుణిగా కొనసాగుతున్నానని తెలంగాణ రాష్ట్ర దశ దిశను నిర్ధేశించే స్థాయితో పాటు119 మంది ఎమ్మెల్యేలను ఎంపిక చేసే బాధ్యతను సోనియాగాంధీ తనకు అప్పగించారని ఇది కొడంగల్ ప్రజల గొప్పతనం అని ప్రజల రుణం ఎప్పటికి తీర్చుకోలేనని అన్నారు.మదన్‌పల్లి గ్రామం నుండి “హత్ సే హత్ జోడో యాత్ర“ కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు.రాహుల్‌గాంధీ చేపట్టిన కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 3574 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రను ప్రతి ఇంటికి,ప్రతి గుండెకు తాకేవిధంగా ముందుకు వెళ్ళతామన్నారు.సీఎం కేసిఆర్ తాగుబోతు మాటాలతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు.గత ఎన్నికల లో ఇచ్చిన హమీలు ఏమయ్యాయని అయన ప్రశ్నించారు.బంగారు తెలంగాణ రాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం,రైతు రుణమాఫీ ఎక్కడ అమలు చేశారని అయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రైతులు మరణించిన తర్వాత ఇచ్చే రైతుభీమా పథకం వలన ఎవరికీ ఉపయోగంలేదని, రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి పంటలకు భీమా పథకం అందించాలని అయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఆడపడుచులకు ఒకతులం బంగారమైన వచ్చింద అని అయన మహిళలను ప్రశ్నించారు.ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు సంతోషంగా ఉన్నారని ఫెన్షన్,ఇందిరమ్మ ఇండ్లు అందరికి అందయని అన్నారు.ధరణి దారిద్రం పొవాలంటే,రైతు రుణమాఫీ,2లక్షల ఉద్యోగాలు రావాలంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు.కొడంగల్ వెంకటేశ్వరస్వామీ దేవాలయం నుండి పార్టీ కార్యకర్తల మధ్య భారీ ర్యాలీలో అంబేద్కర్ చౌరస్తా వరకు కార్యకర్తలు అయనతో పాల్గోన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్‌రాములుగౌడ్, జయకృష్ణ, రాజేష్‌రెడ్డి,సర్పంచ్ రాజేశ్వరి నర్సిములు,నర్సి రెడ్డి,రాంరెడ్డి, మల్లికార్జున్, రాములు,బొంరాస్‌పేట్,దుద్యాల్,కొడంగల్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## 74ఏళ్ల జాతీయ జెండా ఘన చరిత్రకు భంగం

**- సామూహిక జెండా వేడుకలు రద్దు**
**- జెండా ఎగురవేసి చేతులు దులుపుకున్న అధికారులు**
**- నిరుత్సాహానికి గురైన విద్యార్థులు**
**- సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలు**


బోసిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం.

**తాండూరు, జనవరి 26, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో గత 74ఏళ్ల జాతీయ పతాక ఘన చరిత్రకు భంగం కలిగించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే సామూహిక గణతంత్ర్య వేడుకలను అధికారులు రద్దు చేశారు. నామ మాత్రంగా జాతీయ జెండాను ఎగురవేసి చేతులు దులుపుకున్నారు. గత వారం రోజుల ముందు నుండి ఎంతో అశతో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించాలని ఉత్సాహంగా సిద్ధమైనా అధికారుల తీరుతో నిరుత్సాహానికి గురయ్యారు. సామూహిక వేడుకలను రద్దు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతి ఏడాది పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ, గణతంత్ర్య దినోత్సవ వేడుకలను సామూహికంగా నిర్వహించడం ఆనవాయితి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు తహాసీల్దార్ ఆద్వర్యంలో సామూహిక వేడుకలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి వందలాదిమంది విద్యార్థులు హజరవుతారు. ఆయా పాఠశాలల విద్యార్థులు గౌరవ వందనం సమర్పించడంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు, విన్యాసాలు చేస్తూ ఆహుతులను ఆకర్షించేలా ప్రదర్శనలు నిర్వహిస్తారు. సామూహిక వేడుకలలో స్వాతంత్ర్య దినోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరిస్తారు, గణతంత్ర్య వేడుకలకు తహాసీల్దార్ గౌరవ వందనం స్వీకరిస్తారు. అయితే, గురువారం సామూహిక గణతంత్ర్య వేడుకలను ఆకస్మాత్తుగా రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిద సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందకు ఎంతో ఆశతో సిద్దమైన విద్యార్థులు నిరుత్సా హానికి గురయ్యారు. విద్యార్థులకు భావితరాల గురించి అవగాహన కల్పించే వేడుకలను రద్దు చేయడం బాధాకరమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, దేశభక్తులు, రాజకీయ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. మరో వైపు సామూహిక వేడుకలకు వేలమంది విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలకలలాడే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం బోసిపోయింది.

## ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించాలి

### - ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్.

**షాద్‌నగర్, జనవరి 26, (ప్రభాతవార్త) :** ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి అన్ని అంగులాతో షాద్‌నగర్‌లో నూతన ప్రభుత్వ వైద్యశాల భవనం నిర్మిస్తున్నామని, అదేవిధంగా మరో 3 కోట్ల నిధులతో ట్రామా, డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణ శివారులోని నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి ప్రాంగణంలో రూ.3కోట్ల నిధులతో నిర్మించే ట్రామ, డయాలసిస్ సెంటర్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... ఎంతో మంది నిరుపేద ప్రజలు సరియైన వైద్యం అందక ప్రాణాలను కోల్పోయారని, అలాంటి ఇబ్బందులు కలగకుండా మన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందు జాగ్రత్తగా సూపర్ స్పెషలిటి స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించాలన్న లక్ష్యంతో నూతన ఆసుపత్రులను నిర్మించడం జరుగుతందని అన్నారు. అదేవిధంగా వాటిలో బెస్ట్ ఎక్యూమెంట్ ఉండే విధంగా చూడాలని, పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించాలన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కిడ్నీ సమస్యలు,, డయాలసిస్ సమస్యలు ఉన్న పేద రోగులకు ఈ వైద్య సేవలు ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహరమని గ్రహించి నియోజకవర్గంలోని ప్రజలకు ఆ ఇబ్బందులు కలగకుండా చూసేందుకే షాద్‌నగర్‌లో రూ.3కోట్ల నిధులతో ఈ సెంటర్లను ప్రారంభించబోతున్నామని ఆయన తెలిపారు. త్వరలోనే నిర్మాణం పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్, వైస్ ఛైర్మన్ నటరాజన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ విశ్వం, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ మున్సిపల్ 17, 18వ వార్డులో విద్యుత్‌లోఓల్టేజీతో పలు ఇండ్లలో కాలిపోయిన పరికరాల బాధితులతో మాట్లాడి తెలుసుకుంటున్న మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, ఏఈ సతీష్ తదితరులు (ప్రభాతవార్త–ఘట్‌కేసర్)

### వెల్జాల్ గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ



**తలకొండపల్లి జనవరి26,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాని స్థానిక సర్పంచ్ సంగీత శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ,జడ్పి కోఆప్షన్ సభ్యులు మూజీబుర్ రహేమాన్ ,ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,పాక్స్ వైస్ చైర్మన్ కున రవి,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, గవర్నర్ రామకృష్ణ ,వాసవి సంఘం అధ్యక్షుడు కున శ్రీను,ఉప సర్పంచ్ అజీజ్,ఎంపిటిసి అంబాజీ, ఆర్యవైద్య సంఘం సభ్యులు గోపాల కృష్ణ గుప్తా,శేఖర్ గుప్తా,విజయ్ కుమార్ గుప్తా,అశోక్ గుప్తా,సంతోష్ గుప్తా,రాజు గుప్తా,కృష్ణయ్య గుప్తా,శ్రీనివాస్ గుప్తా,మనోహర్ గుప్తా,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,నాయకులు గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు అందజేత

**నాగారం జనవరి26,ప్రభాతవార్త :**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వెస్ట్ గాంధీ నగర్‌లో నాగారం మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,బిసి సెల్ అధ్యక్షుడు రామగోని శ్రీనివాస్ గౌడ్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఆర్మీ సుబేదార్ నర్సింహా రావు, అశోక్ కుమార్‌లకు సన్మానం



**నాగారం జనవరి26,ప్రభాతవార్త :**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ.వార్డులో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాలనీవాసులు 1971 ఇండియా=పాకిస్తాన్ యుద్ధం,1999 సంవత్సరంలో జరిగిన కార్గిల్ యుద్ధభేరిలో పాల్గొన భారత ఆర్మీ సుబేదార్ నర్సింహా రావు ,సుబేదార్ అశోక్ కుమార్‌లను కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న ఆమనగల్లు మున్సిపాలిటీ పాలకవర్గం

**ఆమనగల్లు, జనవరి26, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులను గురువారం పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు రావడంలో ఆమనగల్లు మున్సిపాలిటీకి పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర వహించారని అభినందిస్తూ కమీషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వారిని పాలకవర్గం ఘనంగా సన్మానించింది. గణతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కారాల్యయ ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులకు శాలువాలు కప్పి ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, జ్యోతి నర్సింహ్మా, సుందారి ఝాన్సి చంద్రశేఖర్, దుద్దు విజయ్‌కృష్ణ, భైకని యాదమ్మశ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, విక్రమ్‌రెడ్డి, దివ్య శ్రీకాంత్‌సింగ్, సుజాతరాములు, కమటం రాధమ్మవెంకటయ్య, సోన జయరాంనాయక్, కోఆప్షన్ మెంబర్లు మేడిశెట్టి శ్రీధర్, గజ్జె యాదమ్మ, ఫర్వీన్ హమీద్, పాష, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు క్రీడా సామాగ్రి పంపిణి

**ఆమనగల్లు, జనవరి26, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు స్థానిక ఎంపిటీసిల ఫోరం అధ్యక్షుడు దోనాదుల కుమార్ క్రీడా సామాగ్రిని బహూకరించారు. గణతంత్ర్య దినోత్సవం పురష్కరించుకుని పాఠశాలలో జరిగిన వేడుకలకు హాజరైన కుమార్ విద్యార్థులకు సామాగ్రిని అందజేశారు. ఇండోర్, అవుట్ డోర్ గేమ్సుకు సంబంధించిన పలు రకాల క్రీడా సామాగ్రిని వ్యక్తిగతంగా సమకూర్చి పాఠశాలకు అందించారు. విద్యతోపాటు విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకుని రాణించాలని సూచించారు. కాగా పాఠశాలకు క్రీడా సామాగ్రి అందించినందుకు గాను పాఠశాల సిబ్బంది కుమార్‌ను సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో సర్పంచ్ బల్‌రాం, ఉప సర్పంచ్ అంజలిరెడ్డి, జంతుక వెంకటయ్య, దారిరెడ్డి నర్సిరెడ్డి, ఒగ్గు సుక్కమ్మ, తుమ్మల సత్యంయాదవ్, వరికుప్పల నవీన్, అరుణ్‌కుమార్, గండికోట మహేశ్, శివరాజు, జైపాల్, గోపి, వెంకటేశ్, పవన్, శివ, సాయితేజ, వంశీ, రవి తదితరులు పాల్గొన్నారు.

### నందివనపర్తిలో ముగిసిన వసంత పంచమి వేడుకలు

**యాచారం, జనవరి 26 ప్రభాతవార్త :** మండలంలోని నంది వనపర్తి శ్రీ జ్ఞానసరస్వతి దేవాలయంలో గురువారం వసంత పంచమి వేడుకలను ఘనంగా భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, హైద్రాబాద్ జిల్లాల నుండి సుమారు 250 మంది చిన్నారులకు విద్యారణ్య భారతి స్వామిజీ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులకు జ్ఞానసరస్వతి సంస్థాన్ తరపున పలక, బలపం, అమ్మవారి ఫోటో, కుంకు, ప్రసాదాలు అందించారు. అనంతరం సంకల్పభవన్‌లో సరస్వతిమాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం 10వ తరగతి విద్యార్థులచే పల్లకి సేవ, ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, సమన్వయ మండలి సభ్యులు రాఘవేంద్రశర్మ, శివకుమార్, జలంధర్, నిఖిల్, గణేష్ సంగం, కొండూరు అంజయ్య, రామనాథం, వెంకట్‌రెడ్డి మాతృ మండలి సభ్యులు రుద్రమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి ఆధ్వర్యంలో విజేతలకు బహుమతుల పంపిణీ

**యాచారం, జనవరి 26 ప్రభాతవార్త :** 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి రూ. 13 వేలు విలువ చేసే బహుమతులను ఎంపిపి కొప్పు సుకన్య భాష చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులంతా మంచిగా చదువుకోవాలన్నారు. పాఠశాలకు ఎలాంటి అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు గోగికర్ రమేష్, సంతోష్ గుప్తా, ఎస్ఎంసి చైర్మన్ మద్దెల శారద, ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నందిగామలో తహసీల్దార్ కార్యాలయం ముందు జెండా ఎగురవేస్తున్న ఎమ్మార్వో ఎండి రహిమాన్



తలకొండపల్లిలో జాతీయ జెండాకు హాజరైన ప్రజాప్రతినిధులు అధికారులు



కందుకూరు మండలంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద జెండాఅవిష్కరణ చేసిన ఆర్డీఓ సూరజ్‌కుమార్



బీజేపీ పార్టీ కార్యాలయం ఎదుట జెండా ఎగరవేస్తున్న బీజేపీ నాయకులు



జెండాను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్.



తహసీల్దారు కార్యాలయం వద్ద జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు



ఆమనగల్లులోని మార్కెట్ యార్డు కార్యాయలం వద్ద జెండాకు వందనం సమర్పిస్తున్న చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి



సింగిల్ విండో కార్యాలయం వద్ద జెండా పండుగలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త



తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మార్వో అశోక్ కుమార్, సెల్యూట్‌చేసి జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న దృశం



కొందుర్గు పాఠశాలలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినిలు



జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం సమర్పిస్తున్న ఇన్స్పెక్టర్



-జెండా ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు

# వాడవాడలో మురిసిన మువ్వన్నెల జెండా

**నందిగామ మండలంలో**

**నందిగామ జనవరి26,ప్రభాతవార్త :** నందిగామ మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్వో ఎండి రహిమాన్,ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిపి ఎం.ప్రియాంక, పోలీస్ స్టేషన్ వద్ద సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామయ్య, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి,పిఎసిఎస్ వద్ద చైర్మన్ తోట రాజ్ గోపాల్,గాంధీ చౌక్ వద్ద శివాజీ యూత్ అధ్యక్షుడు ఎర్ర రవి కుమార్ ,హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ఎ.వి ధీనిస్‌లు జాతీయ పతాకాలను ఎగురవేశారు.వేడుకల్లో ఎంపిడిఓ బాల్ రెడ్డి,ఎంపిఓ గిరిరాజ్,ఏపిఎం యాదగిరి,మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్, ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ,చంద్రపాల్ రెడ్డి,దేవల్లే కుమార్ గౌడ్ ఉన్నారు.మండలంలోనే జరిగిన గణతంత్ర వేడుకల్లో సర్పంచ్‌లు ఎనుగొండ రమేష్ గౌడ్,జెట్టకుమార్,గోవిందు అశోక్,స్వామి,జెట్టావత్ రాజు నాయక్,పాండురంగారెడ్డి, చంద్రారెడ్డి,ఎం.సంతోష బుయ్యనీ రజనీత,బండి నీలమ్మ, మేకగూడ సింగిల్ విండో చైర్మన్ కంకంటి మంజులారెడ్డి, చేగూరు చైర్మన్ జి.అశోక్ ,మేకగూడ ఎంపిటిసి రాజు నాయక్,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు, ఆయా శాఖల అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

**తలకొండపల్లి మండలంలో**

**తలకొండపల్లి జనవరి26,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో సోమవారం 74వ గణంతత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ ,జడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌లు జాతీయ జెండాను ఎగరవేశారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణ,పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై వెంకటేష్ ,మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య,మండల పరిధిలోని వెల్జాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ సంగీత శ్రీనివాస్ యాదవ్ జాతీయ జెండాలను ఎగురవేశారు.రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి ,మెదక్‌పల్లి గ్రామంలో సర్పంచ్ ధరణి శివశంకర్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు జర్నలిస్టు శంకర్ ,గ్రామస్తులు విష్ణు గౌడ్,సత్యనారాయణ గౌడ్ హాజరై పాఠశాల విద్యార్థులకు ఆటవస్తువులు అందజేశారు.జాతీయ జెండాలను ఎగురవేశారు.జంగారెడ్డి పల్లి గ్రామంలో సర్పంచ్ వరలక్ష్మి రాజేందర్ రెడ్డి,చెన్నారం గ్రామంలో సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి,గట్టుఇప్పలపల్లి గ్రామంలో సర్పంచ్ జయమ్మ వెంకటయ్య ,మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి హాజరై జాతీయ జెండాను ఎగరవేశారు.పడకల్ గ్రామంలో ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ జాతీయ జెండాకు హాజరైన వారితో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ విద్యా సంస్థల్లో జాతీయ జెండాలను ఎగరవేశారు.ఆయా గ్రామాల పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు మండలంలో**

**కందుకూరు, జనవరి 26, ప్రభాతవార్త:** కందుకూరు మండలంలో 74 వ గణతంత్ర్య దినోత్సవాలను వీధి వాడ గ్రామ గ్రామలలో ఘనంగా జరుపుకున్నారు. మువ్వన్నెల జెండాలను ఎగురవేసి జాతాయ గీతాలను అలపించారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిడిఓ వెంకట్‌రాములు, పిఎసిఎస్ కేంద్రవద్ద చేర్మెన్ డి చంద్రశేకర్, విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఎఇఇ రమేష్ గౌడ్, పిహెచ్‌సి వద్ద డా రాధిక, రక్షకబత నిలయం వద్ద సిఐ క్రిష్ణంరాజు, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మన్నె జయేందర్, బిజెపి కార్యాలయం వద్ద అధ్యక్షులు అశోక్‌గౌడ్, కాంగ్రేస్ పార్టీ కార్యాలయంవద్ద అధ్యక్షులు క్రిష్ణనాయక్, లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. గ్రామాలలో పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు యువజన కార్యాలయాల వద్ద అయా సంఘాల అధ్యక్షులు జాతీయ పతాకాలను ఎగురవేశారు. గ్రామాలలో విద్యార్థులు జాతాయ గీతాలను అలపిస్తు సమర యోదుల స్మరిస్తు నినదించారు. పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అటలపోటీలు నిర్వహించి విజతలకు బహుమతులు ప్రధానం చేశారు.కార్యాక్రమాలలో ప్రజా ప్రతినిదులు యువకు లు ప్రజలు విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గోని వేడుకలను తిల కించి జాతీ యగీతా లను అలపించి వందన సమర్పన చేశారు.

**షాద్‌నగర్ నియోజకవరంలో**

**షాద్‌నగర్, జనవరి 26, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గంలో 74వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ప్రతి గ్రామంలో, అన్ని ప్రభుత్వ కార్యాలయల భవనాల్లో, గ్రామ పంచాయతీల్లో మువ్వెన్నెల జెండాను ఎగరవేశారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, ఎంపీడీఓ కార్యాలయంలో, ఎమ్మార్వో కార్యాలయంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఆర్డీఓ కార్యాలయంలో తదితర చోట్ల ఎగరవేసిన జాతీయ జెండా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాలలో అధికారులచే జెండా ఎగరవేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ రక్షణ కోసం ఎందరో మహనీయులు ప్రాణాలు త్యాగం చేశారని, అలాంటి మహనీయులను మనమందరం స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో :** బీజేపీ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జీ శ్రీర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాయలం ముందు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అందెబాబయ్య పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు చెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో :** 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలంలోని విశ్వాల గ్రామంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, ప్యాడ్లు వంటి సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**అయ్యవారిపల్లిలో :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో సర్పంచి లక్ష్మీరమేష్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో గణతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సమక్షంలో సర్పంచి జెండాను ఎగరవేశారు. ఈకార్యక్రమంలో పులుసుమామిడి రమేష్, నర్సింలు, లక్ష్మయ్య, అంజన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వైస్సార్‌టీపీ ఆధ్వర్యంలో :** గురువారం 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణంలోని ఆఫీసర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ టీపీ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం ఆధ్వర్యంలో మువ్వెన్నెల జాతీయ జెండాను ఎగరవేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, రామేశ్వరరావుపంతులు, శంకర్, సత్యం, అబ్దుల్లా, రామ్‌రెడ్డి, శంకర్, ఈదులపల్లి నరసింహా, ప్రకాష్‌చారి, సందీప్, అలియాస్, మహమ్మద్, హాఖీమ్, జాంగిర్ షఫీ, రాము, శ్రీను, భిక్షపతి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లెడు చౌదరిగూడ మండలంలో**

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 26,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలో జాతీయ జెండావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగె గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యాదమ్మ, తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపిడిఒ మహేష్‌బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు మండలంలో**

**ఆమనగల్లు, జనవరి26, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు భారత 74వ గణతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ, ప్రైవేటు రంగ సంస్థలు, విద్యాలయాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గణతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, యువతీ యువకులు, చిన్నారులు వేడుకలలో పాలుపంచుకున్నారు. ఆయా కార్యాలయాల వద్ద జాతీయ పతకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధుల సమక్షంలో అధికారులు జెండాలను ఎగురవేశారు. గణతంత్ర్య దినోత్సవం సంధర్బంగా ఊరు వాడ పండుగ వాతావరణం సంతరించుకుని ఉప్పొంగిపోయింది. అధికారులు తహసీల్దార్ జ్యోతి, సిఐ జాల ఉపేందర్, ఎంపిడిఓ ఫారూఖ్ హుస్సేన్, ఎస్ఐ సుందరయ్య, కమీషనర్ శ్యాంసుందర్, ఏఓ అరుణకుమారి, ప్రజాప్రతినిధులు ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, ఎక్సజ్ ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**మొయినాబాద్ మండలంలో**

**మొయినాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని తహశీల్దార్ కార్యాలయం మరియు మండల్ ప్రజాపరిషత్ కార్యాలయం, మండల పోలీస్టేషన్, రైతువేధి కార్యాలయాల ముందు 74వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్వో అశోక్ కుమార్ చేతుల మీదుగా జాతీయ జెండాను అవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోంపల్లి అన్నంతరెడ్డి, జెడ్పిటీసి కాలలే శ్రీకాంత్, ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం జేవంత్, ఎంపీడివో సంధ్య, వ్యవసాయ అధికారిణి రాగమ్మ, డ్యిప్యూటి తహశిల్దార్ వినేయ్ సాగర్, ఆర్ఐలు పాండు, చంద్రమోహన్, రెడ్డిపల్లి ఎంపీటీసి మోర్ర శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు, దప్పురాజు, పూసల పరమేష్, తధితరులు పాల్గోన్నారు.

**కొందుర్గు మండలంలో**

**కొందుర్గు జనవరి 26, (ప్రభాతవార్త) :** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలల్లో వాడ వాడల భారత 74వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో తెల్లవారు జామున స్వాతంత్ర్య సమయోధుల నాయకులను స్మరించుకుంటూ వారికి జేజేలు కొడుతూ ప్రభాతబేరి నిర్వహించారు. కొందుర్గు గ్రామ పంచాయతీ వద్ద సర్పంచి కావాలి ఆదిలక్ష్మీ, పోలీస్టేషన్‌పై ఎస్సై వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, మండల పరిషత్ పై ఎంపీపీ పోతురాజు జంగయ్య, ఉన్నత పాఠశాల ముందు ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, పీహెచ్‌సీ వద్ద డాక్టర్ అమృతజోసెఫ్, గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ స్వేత, సింగిల్ విండో పై చైర్మన్ దామోదర్‌రెడ్డి, ట్రాన్స్‌కో పై ఏఈ రమేష్‌కుమారు,, బాలుర ప్రాథమిక పాఠశాల వద్ద హెచ్ఎం వెంకట్‌రెడ్డి, బాలుర ప్రాథమిక పాఠశాలపై హెచ్ఎం వరప్రసాద్‌లు, జాతీయ జెండాలను ఎగురవేశారు. అలాగే గురుకుల పాఠశాలపై ప్రిన్సిపల్ థామస్‌రెడ్డి, హాస్టల్‌పై వార్డెన్ రాములు, బీసీ హాస్టల్‌పై వార్డెన్ రఘురామ్, దళిత వాడ పాఠశాల ముందు హెచ్ఎం ప్రేమ్‌సాగర్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఇంకా ఛత్రపతి శివాజీ, డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం, కమ్యూనిటీ హాల్‌పై ఆయా సంఘాల అధ్యక్షులు జాతీయపథకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, నాయకులు కావలి యాదయ్య, శంకర్, లక్ష్మయ్యగౌడ్, కోమరబండ శ్రీశైలం, ప్రసాద్, పెంటయ్య, రత్నయ్య, చందూ, ప్రవీణ్, నరేందర్, జగదీశ్వర్ గౌడ్, ప్రవీణ్‌గౌడ్, అనీల్‌గౌడ్, బోరిగ నరేందర్, పుర్ర రమేష్, బ్యాగరి రవి, మహ్మద్, దర్గా రాంచందర్‌రెడ్డి, నర్సింలు, అన్నారం రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ మండలంలో**

షాబాద్, జనవరి 26, ప్రభాతవార్త : షాబాద్ మండలంలో గణతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. గురువారం షాబాద్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా రాజకీయ పార్టీ కార్యాలయాలు, ఆసుపత్రులు, యువజన సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తదితర కార్యాలయాలపై జాతీయ జెండా రెపరెపలాడింది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సైదులుగౌడ్, మండల పరిషత్ కార్యాలయంపై ఎంపీడీవో



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపిపి, ఎంపీడీవో, అధికారులు



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

అనురాధ, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మెన్ శేఖర్‌రెడ్డి, పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గురువయ్యాగౌడ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీలో చైర్మెన్ నర్సింగ్‌రావు, వ్యవసాయ కార్యాలయంపై వెంకటేశం, విద్యుత్ కార్యాలయంపై ఏఈ నరేందర్, మండలంలోని 41గ్రామపంచాయతీ కార్యాలయంపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ జాతీయ జెండాలను ఎగరవేశారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు ఉన్నారు.

**శంకర్‌పల్లిలో**

**శంకర్‌పల్లి, జనవరి 26, ప్రభాతవార్త :** 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లి పరిధిలోని, 15వ వార్డులో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ జూలకంటి శ్వేతాపాండురంగారెడ్డి జెండా ఎగురవేశారు. మున్సిపల్ ప్రజలకు గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వార్డు ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

**కొత్తూర్ మండలంలో**

**కొత్తూర్, జనవరి 26, ప్రభాతవార్త :** భారతదేశం సర్వసత్తాక, సార్వభౌమ గణతంత్ర్య రాజ్యమని, పౌరుల్లో గణతంత్ర స్ఫూర్తిని నిలబెట్టాలని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 74వ గణతంత్ర్య దినోత్సవంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి తొలుత స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ, వైస్ ఎంపీపీ శోభలింగంనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మెన్ డోలి రవీందర్, తహసీల్దార్ రాములు, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ఏవో గోపాల్, ఎంపీవో నరసింహ, శ్రీనుచారి, రవినాయక్, కర్రోళ్ల లక్ష్మయ్య, తుప్పర నర్సింహ్మా తదితరులు ఉన్నారు.

**యాచారం మండలంలో**

**యాచారం, జనవరి 26 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేశారు. వివిధ గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ సుచరిత, ఎంపిపి కొప్పు సుకన్య భాష, పలువురు అధికారులు తమ తమ కార్యాలయాల ముందు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయితీ కార్యాలయాల్లో పంచాయితీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు తమ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమాల్లో ఎంపిడివో విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ లలితా జంగయ్య, ఎస్ఎంసి చైర్మన్ మద్దెల శారద, ప్రధానోపాధ్యాయులు రా జేందర్, ఉపాధ్యాయులు ఆనంద్ జోసెఫ్, శ్రీను, గోపాల్, దేవదాను, నీరజ, విజయకుమారి, సుజాత, మంజుల, శిరీష, గాయత్రి, సంధ్య, శ్రీదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సంఘాలు కొండంత అండ

**మహేశ్వరం, జనవరి 26, (ప్రభాతవార్త) :** మహేశ్వరం మండలంలోని స్వయం సహాయక సంఘాలు కొండంత అండగా నిలిచాయని ఎంపీడీఓ నర్సింహులు అన్నారు. గురువారం రోజున మహేశ్వరం మండలంలోని సిరిగిరిపురం గ్రామంలో గ్రామ పంచాయతీ నిరుపేద కుటుంబానికి చెందిన కార్మికునిగా పని చేస్తున్న శంకరయ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 10 గంటలకు తుది శ్వాస విడిచారు. ఇతని భార్య పది సంవత్సరాల క్రితం చనిపోవడంతో శంకరయ్య తనకున్న ముగ్గురు పిల్లలను గ్రామ పంచాయతీ పరిశుభ్ర కార్మికునిగా పనిచేస్తూ పోషిస్తుండే వాడు విరిది నిరుపేద కుటుంబం కావడందో ముగ్గురు పిల్లల రోదనలు గ్రామస్థులందరిని కంట తడి పెట్టించాయి. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న సిరిగిరిపురం గ్రామ స్నేహ సంఘం సభ్యులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని మృతి చెందిన శంకరయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేయాలని మాట్లాడుకొని గ్రామ సంఘంలో ఉన్న 29 స్వయం సహాయక సంఘం నుంచి 1000 రూపాయల చొప్పున మొత్తం 29వేలు అప్పుడే వసూలు చేసుకొని గ్రామ సర్పంచి కాసుల సురేష్, ఏపీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు చెక్కును, ఎంపీడీఓ నర్సింహులు గ్రామ సంఘం సభ్యులు కలిసి అందజేయడం జరిగింది. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్న వీజేప పద్మ, గ్రామ సంఘం అధ్యక్షులు సంధ్య, స్వయం సహాయక సభ్యులను ఎంపీడీఓ గ్రామస్థులందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, దయ్యల శ్రీను సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

